క్లుప్తంగా

రైతు ఆత్మహత్యాయత్నంపై డీఎస్పీ విచారణ

ముప్పాళ్ల: మండలంలోని మాదల గ్రామానికి చెందిన రైతు ఆత్మహత్యాయత్నంపై సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ గురువారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన మర్రిపూడి లక్ష్మయ్య అనే రైతు.. తన స్థలం హద్దులు మారుస్తున్నారంటూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన విదితమే. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలపై సర్వేయర్‌తో డీఎస్పీ మాట్లాడి, వివరాలు సేకరించారు. వివాదాలకు తావు లేకుండా, సమస్య పరిష్కరించాలని సర్వేయర్‌కు సూచించారు. ఎస్సై ఎం.పట్టాభిరామయ్య, సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

పాస్టర్లకు దుస్తులు పంపిణీ



రాజుపాలెం: సమాజానికి దేవుని వాక్యం బోధించే ప్రతి సేవకుడు.. మంచి జీవితానికి ఒక మార్గాన్ని చూపించాలని జైన్ పెంతెకోస్తు చర్చి ఫౌండర్ బిషప్ ఫ్రాన్సిస్ జాక్సన్ పేర్కొన్నారు. మండలంలోని కొండమోడులో గల సజీవుని ప్రార్థన మందిరంలో అలీవ్ మినిస్ట్రీస్ ట్రస్ట్ ఫౌండర్ జీఎస్ఆర్ రెడ్డి ఆధ్వర్యంలో సేవకుల సదస్సు గురువారం ఘనంగా జరిగింది. ఈ సదస్సులో 110 మంది పాస్టర్లకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సభకు అధ్యక్షుడిగా బిషప్ జోసఫ్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో బిషప్ రూజ్‌వెల్ట్, రెవరెండ్ ఐజాక్ పాల్, లివింగ్ స్టన్, మండల డివైన్ పాస్టర్స్ యూనియన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

కోడి పందేలు, పేకాట ఆడితే కఠిన చర్యలు

క్రోసూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలో ఎక్కడైనా కోడిపందేలు నిర్వహించినా, పేకాట ఆడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సీహెచ్ మణికృష్ణ గురువారం హెచ్చరించారు. పండుగ సందర్భంగా దూర ప్రాంతాల నుంచి వచ్చిన స్థానికులు, బంధువులు కోడిపందేల్లో పాల్గొనవద్దని తెలిపారు. సంతోషకరంగా.. ఆహ్లాదకరమైన వాతావరణంలో పండుగను జరుపుకోవాలని కోరారు.

హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలి



పెదకూరపాడు: ప్రజా ప్రతినిధుల వెంట నిర్దిష్ట సమయం లేకుండా ఉదయం 7 నుంచి రాత్రి 11గంటల వరకు నియోజక వర్గాల్లో పర్యటించాల్సి వస్తోందని, ఇంటర్నెట్ లేని ప్రాంతాల్లో పర్యటించాలని కావున ముఖ ఆధారిత హాజరు నుంచి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీలు, వోఎస్డీల వ్యక్తిగత కార్యదర్శులు, సహాయకులకు మినహాయింపు ఇవ్వాలని వ్యక్తిగత కార్యదర్శుల అసోసియేషన్ నాయకులు, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పీఏ దర్శి వెంకటేశ్వరరావు కోరారు. ఈ సందర్భంగా సీఎస్ జవహర్ రెడ్డిని కలిసి విన్నతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ వినతిపై సీఎస్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి బాస్కర్‌రెడ్డి పీఏ, గుంటూరు ఎమ్మెల్యే షేక్ ముస్తాఫా పీఏ, పాలకొండ ఎమ్మెల్యే కళావతి, విశాఖపట్నం జిల్లా ఎమ్మెల్సీ వంశీ పీఏ తదితరులు పాల్గొన్నారు.

రైలు రోకోను జయప్రదం చేయాలి

సత్తెనపల్లి: మతం మారిన ఎస్సీ క్రైస్తవులకు.. ఎస్సీ హోదా కోరుతూ పెదకూరపాడు, నరసరావుపేటలో ఈ నెల 20న చేపట్టనున్న రైలు రోకోను జయప్రదం చేయాలని ఐడియా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గొల్లమూడి రాజసుందర్ బాబు కోరారు. గురువారం సత్తెనపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆల్ ఇండియా క్రిస్టియన్ యూత్ అసోసియేషన్, ఏపీ అంబేడ్కర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రైలు రోకోలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మతం మారిన ఎస్సీలకు.. ఎస్సీ కుల రిజర్వేషన్లు, ఇతర ప్రయోజనాలు తీసివేయడం సబబేనని మోడీ ప్రభుత్వం సుప్రీం కోర్టులో వేసిన సమాధానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలో 25వ ఆర్టికల్ ప్రకారం ప్రతి పౌరుడు తనకిష్టమైన మతాన్ని స్వీకరించి, ప్రచారం చేసుకోవచ్చన్నారు. అయితే దీనికి విరుద్ధంగా మోడీ ప్రభుత్వం క్రైస్తవ, ముస్లిం మతాలకు మారిన ఎస్సీలకు రాజ్యాంగ ప్రయోజనాలు ఇవ్వడం కుదరదని అనటం రాజ్యాంగ విరుద్ధమన్నారు. దీన్ని ఖండిస్తూ క్రైస్తవ పాస్టర్లు, దళిత క్రైస్తవ యువత, మహిళలు, ముస్లింలు ఈ రైలు రోకోలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఐద్వా నాయకులు మట్టుపల్లి వీరమ్మ, ఆలూరి కోటేశ్వరి, మట్టుపల్లి దమయంతి, బెజ్జం మేరీ, మట్టుపల్లి చిన్నబాబు, సాపాటి శాంతకుమారి, ఎస్.పిచ్చమ్మ తదితరులు ఉన్నారు.

మంచిని చూడండి.. మనసారా ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- ముస్సాపురం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



ముస్సాపురంలో కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పెదకూరపాడు: మంచిని చూడండి.. మనసారా ఆశీర్వదించండి అని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రజలను కోరారు. మండలంలోని ముస్సాపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరరావుకు మహిళలు హారతులు పట్టి, స్వాగతం పలికారు. వృద్ధులను, మహిళలను సంక్షేమ పథకాల్లో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా.. అని అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ కరపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు ఇలా అన్ని వర్గాల ఆర్థిక ఎదుగుదలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలను ప్రకటించారని గుర్తుచేశారు. సంక్షేమ పథకాలతో ఎంతో మంది పేదలు సంతోషంగా ఉన్నారన్నారు. అందుకు గడప గడపకు కార్యక్రమంలో లభిస్తున్న ఆత్మీయ స్వాగతమే నిదర్శనమన్నారు. ముస్సాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో రూ.7.32 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. గ్రామ సచివాలయం రూ.35 లక్షలు, రైతు భరోసా కేంద్రం రూ.21.8లక్షలు, రూ.17.5లక్షలతో వెల్‌నెస్ సెంటర్ నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, జడ్పీటీసీ స్వర్ణకుమారి, ఈదా సాంబిరెడ్డి, ఇన్నమ్మ, జయమ్మ, సాంబ శివరావు తదితరులు పాల్గొన్నారు.

ముందే వచ్చిన సంక్రాంతి శోభ..



సంక్రాంతి సంబరాలకు విద్యార్థుల అహ్వానం



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే



నకరికల్లు మండలం దేచవరం గ్రామంలో డూడూ బసవన్న సందడి

- తెలుగుదనం ఉట్టిపడేలా ముందస్తు సంబరాలు
- భోగి మంటతో ప్రారంభించిన నంబూరు దంపతులు
- పెదకూరపాడులో సంక్రాంతి కళ



భోగి మంట వేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దంపతులు

పెదకూరపాడు: సంక్రాంతి పండుగ శోభ ముందే వచ్చేసింది. తెలుగుదనం ఉట్టిపడేలా పెదకూరపాడులో మందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. వైఎస్సార్ ఇందిర క్రాంతి పథం ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు నిర్వహించిన వేడుకలను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, వసంతకుమారి దంపతులు గురువారం ప్రారంభించారు. స్థానిక జీఆర్‌సీఆర్‌కే శ్రీ చైతన్య పాఠశాల ప్రాంగణంలో వేసిన భోగి మంటలు.. నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు.. నృత్యం చేసిన గంగిరెద్దులు.. కాలుదూసిన కోడిపుంజులతో అసలైన సంక్రాంతి కళ్ల ముందు కనిపించింది. ఎమ్మెల్యే నంబూరు దంపతులు భోగి మంట వేసి, పొంగళ్లు పొంగించారు. రంగవల్లులతో మైదానం రంగుల మయం అయ్యింది. ముగ్గుల పోటీల్లో మహిళలు పోటీపడి రంగవల్లులను తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడారు.. ఆరుగాలం కష్టించి పండించిన పంట లోగిళ్లకు చేరిన తరుణంలో ఆనందాలు పంచే పండుగ.. సంక్రాంతి అన్నారు. గంగిరెద్దులు, తీర్చిదిద్దిన రంగవల్లుల్లో గొబ్బెమ్మలు, హరిదాసుల సంకీర్తనలు తెలుగుజాతి గొప్పతనానికి ప్రతీకలన్నారు. మహిళలు, విద్యార్థుల మధ్య సంక్రాంతి సంబరాలు జరుపుకోవడం సంతోషమన్నారు. నంబూరు వసంతకుమారి మాట్లాడుతూ.. నేటి తరం యువత సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతను తెలుసుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి పండుగ వెనుక ఏంతో గొప్ప సందేశం, చరిత్ర ఉందన్నారు. అనంతరం ముగ్గులు, ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, జడ్పీటీసీ కంకణాల స్వర్ణకుమారి, మాజీ ఎంపీపీ ఈదా సాంబిరెడ్డి, వైఎస్ ఎంపీపీ షేక్ చాంద్‌బాషా, వైఎస్సార్ సీపీ నాయకులు కంకణాల శివాజీ, భయంకర్ సుభాని, మాగులూరి అనిల్, బచ్చు హనుమంతురావు అల్లం ఇన్నమ్మ, కిషోర్ రెడ్డి, రహ్మత్ బాషా, నిర్వాహకులు జీఆర్‌సీఆర్‌కే డైరెక్టర్లు గుత్తా రాము, కవిత, వెంకటేశ్వర్లు, ఏపీఎం ఉషశ్రీ, సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

ప్రతి మహిళ ఆర్థిక స్వావలంబన సాధించాలి

పెదకూరపాడు: ప్రతి మహిళ ఆర్థిక స్వావలంబన సాధించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. పెదకూరపాడులోని ఇందిరా క్రాంతి పథం ఆధ్వర్యంలో 100 మంది మహిళలకు రాయితీపై అందించే కుట్టు మిషన్లను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, ఆయన సతీమణి వసంతకుమారి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నాయక్, ఏపీఎం ఉషశ్రీ, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, జడ్పీటీసీ కంకణాల స్వర్ణకుమారి, సీసీలు, యానిమేటర్లు పాల్గొన్నారు.

నష్టపరిహారం ఇవ్వాలి

పత్తి రైతుల ఆందోళన



ఏడీఏ కార్యాలయానికి తాళం వేసి, ధర్నా చేస్తున్న రైతులు

క్రోసూరు: క్రోసూరు మార్కెట్‌యార్డులోని ఏడీఏ కార్యాలయం ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో నకిలీ పత్తి విత్తనాలతో నష్టపోయిన రైతులు గురువారం ఆందోళన చేపట్టారు.తమకు వెంటనే నష్ట పరిహారం చెల్లించాలంటూ కార్యాలయానికి తాళం వేసి సాయంత్రం వరకు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. సిక్సర్ రకం పత్తి విత్తనాలు సాగు చేసి, నష్టపోయిన తాళ్ల చెరువు రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తాళ్ల చెరవు నకిలీ పత్తి విత్తనాల విషయమై.. జిల్లా వ్యవసాయ శాఖాధికారులకు, రాష్ట్ర కమిషనర్‌కు తెలియజేసినట్లు తెలిపారు. తాళ్ల చెరువు గ్రామంలో వ్యవసాయం ప్రధాన జీవనాధారమని, నకిలీ విత్తనాలు సాగు చేసి రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. నకిలీ విత్తనాల కంపెనీపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నాలో రాష్ట్ర కమిటీ సభ్యులు గద్దె చలమయ్య, మర్రెడ్డి, రావెల వెంకటేశ్వర్లు, ఆవుల ఆంజనేయులు, హనుమంతరావు, బాధిత తాళ్లచెరువు రైతులు నల్లగొండ కోటేశ్వరరావు, కె.శ్రీను చింతపల్లి శ్రీనివాసరావు, సంపంగి సురేష్ గాదె వెన్నారెండి, తుమ్మ బాలస్వామి, పూతల గురువయ్య పాల్గొన్నారు.

రోడ్డుపై బైఠాయించి...

అచ్చంపేట: సిక్సర్ రకం హైబ్రీడ్ పత్తివిత్తనాలు విత్తి.. తీవ్రంగా నష్టపోయామని, సదరు కంపెనీ ప్రతినిధులు, డీలర్లు పరిహారం ఇస్తామంటూ మభ్యపెట్టి.. చేతులెత్తేశారని తాళ్లచెరువు గ్రామ రైతులు గురువారం అచ్చంపేటలో రోడ్డుపై బైఠాయించారు. ఒక్క తాళ్లచెరువులోనే 200మందికి పైగా రైతులు 400లకు పైగా ఎకరాల్లో పత్తివిత్తనాలు విత్తినట్లు తెలిపారు. ఎకరాకు రూ.50వేలకు పైగా పెట్టుబడులు అయ్యాయని, 15 నుంచి 20 కింటాళ్ల వరకు దిగుబడి రావలసి ఉండగా ఒక్క క్వింటా కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ యాజమాన్యం, డీలర్లు కుమ్మక్కై నకిలీ విత్తనాలు అంటగట్టి తమను నిలువునా ముంచారని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు పంటలను పరిశీలించారని, పల్నాడు జిల్లా కలెక్టరు, స్థానిక ఎమ్మెల్యే స్వయంగా వచ్చి పంట నష్టాలను గమనించారని ఎస్ఐ కె.పాల్ రవీంద్ర రైతులతో మాట్లాడారు. ఈ ఆందోళనలో రైతు నాయకులు పాల్గొన్నారు.

డీఎన్ఏ పరీక్ష ఫలితాలు రావాలి..

దీనిపై ఏడీఏ హనుమంతరావు వివరణిచ్చారు. గతంలో పల్నాడు జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాస్త్ర వేత్తలు సిక్సర్ విత్తన పంటను పరిశీలించడం జరిగిందన్నారు. ఖచ్చితమైన నివేదిక కోసం పత్తి విత్తనాలను డీఎన్ఏ పరీక్షలకు పంపించడం జరిగిందని తెలిపారు. వాటి ఫలితాలు వచ్చిన వెంటనే జిల్లా కలెక్టర్, వ్యవసాయశాఖ కమిషనర్ తదుపరి చర్యలు తీసుకుంటారని తెలిపారు.

వినోదాన్ని వ్యాపారం చేస్తే.. కఠిన చర్యలు

- సత్తెనపల్లి ఆర్డీఓ రాజకుమారి
- సినిమా థియేటర్లు పరిశీలించి, హెచ్చరికలు జారీ



థియేటర్‌లో తనిఖీ చేస్తున్న ఆర్డీఓ రాజకుమారి

సత్తెనపల్లి: ప్రేక్షకుల వినోదాన్ని వ్యాపారంగా మారిస్తే కఠిన చర్యలు తప్పవని సత్తెనపల్లి ఆర్డీఓ బీఎల్ఎన్ రాజకుమారి హెచ్చరించారు. పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేరకు టిక్కెట్లు అధిక ధరలకు విక్రయిస్తున్నారని ప్రేక్షకుల ఫిర్యాదు మేరకు పట్టణంలోని మూడు సినిమా థియేటర్లను గురువారం సందర్శించారు. ప్రేక్షకులతో స్వయంగా మాట్లాడారు. మూడు థియేటర్లకు సంబంధించి అనుమతి పత్రాలు సరిగా లేవని గుర్తించారు. ఇప్పటి వరకు రెన్యూవల్స్ కాలేదని ప్రశ్నించగా పొంతనలేని సమాధానాలతో యాజమాన్యం మాట దాటవేయడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆమెతో పాటు సిబ్బంది ఉన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

నరసరావుపేట టౌన్: తప్పిపోయిన బాలుడిని పోలీసులు సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించిన సంఘటన గురువారం పట్టణంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పిడుగురాళ్ల పట్టణానికి చెందిన ఎనిమిదేళ్ల బాలుడు మీసాల ప్రతాప్ అతని తల్లి అరుణతో నరసరావు పేటకు వచ్చాడు. ఆడుకుంటూ రామిరెడ్డి పేటకు వెళ్లి తప్పిపోయాడు. అక్కడ ఏడుస్తుండగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో వన్‌టౌన్ పోలీసులు బాలుడిని స్టేషన్‌కు తీసుకొచ్చారు. బాలుడు ఇచ్చిన చిరునామాలో గృహానికి వెళ్లి విషయాన్ని తెలియజేశారు. దీంతో కుటుంబ సభ్యులు స్టేషన్‌కు వచ్చి తమ కుమారుడిని తీసుకెళ్లారు.

పూరిల్లు దగ్ధం



దుర్గి: దుర్గిలోని జంగాల కాలనీలో పూరిల్లు దగ్ధమైన ఘటన గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన పర్రె హనుమయ్యకు చెందిన పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. ఇంట్లోని దుస్తులు, ఫర్నీచర్ తో పాటు రూ.1.50లక్షల నగదు పూర్తిగా కాలిపోయినట్లు బాధితుడు తెలిపారు. డ్వాక్రా గ్రూపు సభ్యులకు సంబంధించిన డబ్బులు దగ్ధమైనట్లు చెప్పారు. కట్టు బట్టలతో మిగిలామని ఆవేదన వ్యక్తం చేశాడు. ఘటనా స్థలాన్ని పోలీసులు, విద్యుత్ ఏఈ ఎం.రాంబాబు, వీఆర్వో పరిశీలించారు.

ఆగిన లారీని ఢీకొట్టిన వాహనం..తప్పిన ప్రమాదం



దెబ్బతిన్న వాహనం

రెంటచింతల: స్థానిక బీసీ బాలురు సంక్షేమ వసతి గృహం సమీపంలో గురువారం ఆగిన లారీని బొలెరో వేగంగా వచ్చి ఢీకొట్టింది. వేకువ జామున జరిగిన ఈ రోడ్డు ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. వరిగడ్డితో మాచర్ల వైపు వెళ్తున్న లారీ మరమ్మత్తుల కారణంగా.. డ్రైవర్ రోడ్డు మార్జిన్లో నిలిపివేశాడు. రెంటచింతల నుంచి మాచర్ల వైపు వస్తున్న బొలేరో వాహనం వేగంగా వచ్చి లారీని బలంగా ఢీకొట్టగా.. డ్రైవర్ నూకరాజుకు స్వల్ప గాయాలయ్యాయి. లారీ లంకలోకి వెళ్లి ఆగిపోయింది.

భక్త వరదుడిగా శ్రీవారి దర్శనం



భక్త వరదుడు అలంకరణలో శ్రీవారు

సత్తెనపల్లి: పట్టణంలోని వడవల్లి శ్రీరామ ఆలయం, శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, రైల్వే స్టేషన్ రోడ్డులోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ధనుర్మాసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి, అర్చకులు పూజలు నిర్వహించారు. వడవల్లి రామాలయం, వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సుదర్శన హోమం వైభవంగా నిర్వహించారు. రైల్వే స్టేషన్ రోడ్డులోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీవారిని భక్త వరదుడి అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి, స్వామి వారి కృపకు పాత్రుల య్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలుగకుండా ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భారతదేశ గొప్పతనాన్ని చాటిన వివేకానందుడు

- స్వామి వివేకానంద చైతన్య భారతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్
- వాడ వాడలా స్వామి వివేకానంద జయంతి వేడుకలు



సభలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీధర్, పక్కన అంజిరెడ్డి తదితరులు

సత్తెనపల్లి: దేశాన్ని జాగృతం చేయడమే కాకుండా.. తన ఉపన్యాసాలు, వాదనలతో భారతదేశ గొప్పతనాన్ని చాటి చెప్పిన గొప్పతత్వవేత్త స్వామి వివేకానందుడని స్వామి వివేకానంద చైతన్య భారతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జి.శ్రీధర్ పేర్కొన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల నుంచి ప్రధాన రహదారిలో గల స్వామి వివేకానంద విగ్రహం వరకు గురువారం శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వివేకానందుడుని స్ఫూర్తిగా తీసుకొని యువత అన్ని రంగాల్లో దూసుకుపోవాలని ఆకాంక్షించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ అంజిరెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచ శాంతి, సౌభాగ్యం కోసం స్వామి వివేకానంద అవతరించారని, స్వామీజీ సందేశం మానవజాతి ఉన్నంత వరకు నిలిచి ఉంటుందన్నారు. సంస్థ కోశాధికారి శ్రీనివాసరెడ్డి, గౌరవ అధ్యక్షుడు కొల్లిపర కాశీ విశ్వనాథం, కార్యదర్శి కాకాని శ్రీనివాసరావు, సభ్యుడు జీపీఎస్ శాస్త్రి మాట్లాడారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో న్యాయ వాదులు ఎంవీ సుబ్బారెడ్డి, చలువాది చిన్న సత్యనారాయణ, తొమ్మండ్రు సత్యనారాయణ, దేవరశెట్టి రవికుమార్, సంస్థ సభ్యులు, యోగ సాధకులు, తదితరులు ఉన్నారు.

నవ చైతన్య వివేకా సేవా సమితి ఆధ్వర్యంలో..

పట్టణంలోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద నవ చైతన్య వివేకా సేవా సమితి అధ్యక్షుడు నోముల వెంకట చలపతిరావు ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. సంస్థ కార్యదర్శి, న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు సభా పరిచయం చేశారు. స్వామి వివేకానంద చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. సభలో విశ్రాంత తెలుగు పండితుడు మంచికంటి వెంకటేశ్వరరావు మాట్లాడారు. ప్రముఖ పారిశ్రామికవేత్త చిర్ర రామలింగారెడ్డి, ఎల్ఐసీ రాఘవరెడ్డిని సత్కరించారు. పేదలకు దుప్పట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కట్టా శంకరరావు, కేతనబోయిన హనుమంతురావు, ఉల్లి రమాదేవి, వి.వెంకటేశ్వర్లు, మందపాటి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు విప్పర్ల పాండురంగారావు, కురిచేటి నాసరయ్య, చిన్నం ప్రసాద్ తదితరులు ఉన్నారు.

హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో

హెల్ప్ ఫౌండేషన్ వ్యవ స్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు ఆధ్వర్యంలో పట్టణంలోని ఫౌండేషన్ కార్యాలయంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

క్రోసూరు: 75 త్యాళ్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో పి.స్వర్ణకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని హసనాబాద్(4)అంగన్‌వాడీ కార్యకర్త(బీసీ,బీ), గాదెవారిపాలెం(107)అంగన్‌వాడీ కార్యకర్త (ఓసీ), గాదెవారిపాలెం (107)అంగన్‌వాడీ సహాయకురాలు(ఓసీ) ఖాళీలకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు చెప్పారు. ఈ నెల 24న సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులను అభ్యర్థులు 75 త్యాళ్లూరు కార్యాలయంలో స్వయంగా అందజేయాలని తెలిపారు. పదవ తరగతి పాసై, స్థానిక వివాహితులై ఉండాలన్నారు. వయస్సు 35ఏళ్ల లోపు, ఎస్సీ, ఎస్టీలైతే కనీస వయసు 21 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. ఒంటి మహిళ అయితే తప్పని సరిగా భర్త మరణ ధృవీకరణ పత్రం అందజేయాలన్నారు.

ఆయా పోస్టు ఖాళీ

ముప్పాళ్ల: మండలంలోని కుందురువారిపాలెం అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ పి.స్వర్ణకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు 24వ తేదీ లోపు రాజుపాలెం ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

యడ్లపాడు: మండలంలోని బోయపాలెం 16వ నంబర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మైదవోలు గ్రామానికి చెందిన పల్లపు శివపోలయ్య (32) బైక్‌పై 16వ నంబర్‌జాతీయ రహదారి బోయపాలెం అండర్‌పాస్ వంతెన మీదుగా రాంగ్‌రూట్లో ఇంటికి వచ్చే క్రమంలో ఎదురుగా వచ్చిన గుంటూరు ఆర్టీసీ బస్సు ఢీకొంది. సుమారు రాత్రి 11 గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో వాహనాలు రెండు పాక్షికంగా ధ్వంసం కావడంతో పాటు బైక్‌పై ఉన్న శివపోలయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వాహనాలను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి కోటి వీరయ్య ఫిర్యాదు మేరకు గురువారం పోస్టుమార్టం పూర్తిచేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇదిలాఉండగా, గతేడాది జనవరి 31న శివపోలయ్య భార్య గోవర్ధిని మృతి చెందింది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.